# మామ్మకు వీడ్కోలు

సాయంత్రము ఆరుగంటలవేళ.

మామ్మ వారపత్రిక చదువుతూ వరెండా మెట్లమీద కూర్చుంది. ఇసకలో ఆడుకుని పిల్లలు మామ్మదగ్గరికి పరుగెత్తుకుంటూ వచ్చారు.

"అబ్బ, ఇసకలో ఆడారా ? కాళ్లూ చేతులూ ముఖం బాగా కడుక్కురండి. బట్టలుకూడా మార్చుకోండి. లేకపోతే రాత్రికి నిద్రపట్టదు. మీరురాగానే భోజనాలుచేసి కొంచెంసేపు రేపటి పాఠాలు చూసుకుని పడుకుందురుగాని" మామ్మ వారపత్రిక అక్కడపడేసి లోపలికి వెళ్ళింది భోజనాల ఏర్పాటుకు.

ఒక్కొక్కరే నలుగురు పిల్లలు వచ్చారు భోజనాల యింట్లోకి.

"మామ్మా! నేనివాళ నీదగ్గరగా కూర్చుంటాను. వాడు నిన్న నీదగ్గర కూర్చున్నాడుగా"

"సరే నీవే కూర్చో'' అంటూ ఒకపళ్ళెంలో బంగాళాదుంపకూర నెయ్యి వేసి అన్నంలో కలిపి ఒక్కొక్కళ్ళకి వాళ్ళపళ్ళేలలో పెట్టింది. మంచినీళ్ళ గ్లాసులు దగ్గరగా పెట్టుకుని కూర్చుంది.

"మామ్మా ఇవాళేమో దిలీప్ శంభూమీద నాలుగు గుప్పెళ్ళ ఇసకపోశాడు. వద్దురా అంటున్నా వినిపించుకోలేదు" అన్నది ప్రతిమ.

"నిజమా ! అలాపోసుకుంటే కంట్లోపడదూ ? బంతులు తీసుకెళ్ళినవాళ్ళు వాటితో ఆడుకోక ఇసకలోకి ఎందుకువెళ్ళారు ? మీరిట్లా అల్లరిచేస్తుంటే మీనాన్నలకు చెప్పాల్సివస్తుంది. కూరన్నం తినండి చారన్నం కలుపుతాను. గ్లాసెడు మంచి నీళ్ళు అప్పుడే తాగేశారా ? నీళ్ళతో కడుపునింపుకుంటే అన్నం ఏంతింటారు ?'' శ్రీలూ, నీగ్లాసులో నీళ్ళన్నీ తాగేశావా ?"

''లేదు మామ్మా. నీళ్ళు కిందపోయాయి"

''మళ్ళీ పోస్తాలే. చారన్నం గబగబా తినండి. అలాగే మింగకండి. నమిలి తినాలి. దీనితరువాత పెరుగూ వడియాలు అప్పడాలు."

"ఇవాళ మామ్మ కథ చెప్పలేదు భోజనాలయాక చెప్తావా ? మామ్మా ?"

"మీకు టైమేదీ వినటానికి ? కొంచెంసేపు చదువుకోవద్దూ ?"

''మధ్యాహ్నం నిద్రలేవగానే చెప్పావు పాఠాలన్నీ. ఇప్పుడేంలేవు".

"అయితే చెప్తాలే. పెట్టింది పారెయ్యకుండా తినాలి. గబగబాతిని చేతులు కడుక్కుని నలుగురూ గదిలోకి పదండి. నేను మీవెనకే వస్తాను."

మామ్మ వాళ్ళవెనకాలే వెళ్ళి గదిలో మంచమ్మీద కూర్చుంది. పిల్లలు నలుగురూ చుట్టూచేరారు "మామ్మా కథ.''

"చెప్తానుండండి. నిన్న ఏంకథ చెప్పాను ?" పిల్లలను ప్రశ్నించింది.

"అదే గొల్లపిల్లవాడు పులికథ చెప్పావు. అసలాకథ ఎన్నోసార్లు చెప్పావు? ఇవాళ కొత్తది చెప్పు."

మామ్మ కొత్తకథ చెప్పటం మొదలుపెట్టింది.

ఆ కథ వింటున్న పిల్లలు పక పక నవ్వటం మొదలుపెట్టారు.

"మామ్మా ఆ ఎలుకకు పిల్లినిచూస్తే భయం పుట్టలేదా ?"

''ఆఁ హాఁ. భయం ఎట్లావేస్తుంది ? అది ఒంటినిండా ఎర్రటిరంగు వేసుకుందిగా ?''

"అయితే ఎలుకను పిల్లి గుర్తుపట్టలేదా ?"

"ఆఁహాఁ. ఆ ఎలుక బాగా లావుగాఉంది. ఎప్పుడో తలుపుసందులోపడి దానితోక తెగిపోయింది. ఇంక పిల్లి గుర్తు ఎలాపడుతుంది ? అదేదో కొత్తజంతువు కాబోలని చూస్తుండగా, దానిముందునుంచే ఎలుక ఠీవిగా అటూఇటూ తిరుగుతూ, దానికి కావలసినని తిని కలుగులోకి పరుగెత్తింది."

"మామ్మా పిల్లికి భయం వెయ్యలేదూ ఎలుకనుచూస్తే ?"

"వేసేఉంటుంది. లేకపోతే ఎలుక ఎదురుగా తిరుగుతూఉంటే ఒకమూలకు ఒదిగి కళ్ళుమూసుకుని కూర్చుంటుందా!"

పిల్లలు ఐదూ ఆరేళ్ళవాళ్ళు. లోకంతీరు ఇంకా సరిగా తెలియదు. మామ్మ చెప్పినకథను నమ్మి, నవ్వినంత సేపు నవ్వి "మామ్మా నిద్ర నిద్ర" అని ఒకరన గానే అందరికీ ఆవలింతలు వచ్చాయి.

''అయితే అందరు గదిలోకిపదండి. పక్కలువేసేఉన్నాయి. మంచాలెక్కి పడుకోండి. నేను ఇప్పుడేవస్తా."

సాధారణంగా మామ్మగదిలో పక్కలు ఆ నలుగురికీ వేసేఉంటాయి. చిన్నచిన్న మంచాలు కనుక మామ్మ మంచందగ్గరగా లాక్కుని పడుకున్నారు. మామ్మఉంటే వాళ్ళు తల్లులను మర్చిపోతారు.

మామ్మ రాత్రిళ్ళు రెండుచపాతీలు తిని కప్పుపాలు తాగుతుంది. పిల్లల భోజనాలుకాగానే ఆమెకు పీటవేసి చపాతీలు పళ్ళెంలో పెట్టిఉంటాయి. ఆమె ఐదునిమిషాలలో చపాతీలు తిని పాలుతాగింది. కాళ్ళు కడుక్కుని మంచినీళ్ళ చెంబుతో గదిలోకి వచ్చింది.

"అందరూ పడుకున్నారా ?" వస్తూనే అడిగింది.

"నేను పడుకోలేదు మామ్మా. వాళ్ళంతా ముసుగుపెట్టుకుని దాంట్లోదూరి మాట్లాడుకుంటున్నారు. నవ్వులుకూడా నాకు వినిపించాయి. నాకు తెలియకుండా ఉండాలని గుసగుసలు మొదలుపెట్టారు మామ్మా. వీళ్ళు చాలా అల్లరిచేశారు." శ్రీలు నిద్రపోతున్నవాళ్ళమీద చాడీలు చెప్పింది.

"మామ్మ పకపక నవ్వుతూ "మొన్న వాళ్ళూ నీమీదా ఇట్లాగేచెప్పారు'' అన్నది.

"మామ్మా, కథచెప్తానన్నావుగా ?" అడిగింది శ్రీలు.

"మీకు నిద్రవస్తుంటే కథేంవింటారు ? రేపుచెప్తాను. శ్రీరాముడికథ బాల రామాయణం చదువుతాను వినండి. అదివింటుంటే మీకు నిద్రవస్తుంది. భయం పుట్టేకలలురావు"

"శుద్ధబ్రహ్మ పరాత్పరరామ
కాలాత్మక పరమేశ్వరరామ
శేషతల్ప సుఖనిద్రితరామ
బ్రహ్మాద్యమర ప్రార్థితరామ
చండకిరణకుల మండనరామ
శ్రీమద్దశరథనందన రామ
కౌసల్యాసుఖ వర్ధనరామ
విశ్వామిత్ర ప్రియధనరామ
ఘోరతాటకా ఘాతకరామ
మారీచాది నిపాతకరామ"

ఏమర్రా! అందరికీ నిద్రలు వచ్చాయా?

-మెల్లగా అడిగింది.

"నాకురాలేదు మామ్మా." అన్నాడు శంభు.

"సరే- వింటూ పడుకో."

"కౌశిక మఖ సంరక్షకరామ
శ్రీమదహల్యోద్ధారకరామ

"శంభు నిద్రపోయావా?"

పిల్లలెవరూ మాట్లాడలేదు.

ఆ బాలరామాయణాన్ని మామ్మ ప్రతిరోజూ ఒక జోలపాట మాదిరిగా సన్నగా పాడుతుంది. లాలిపాటరాగం ఒకమత్తుమందులా ఉంటుంది. నిశ్శబ్ద వాతావరణంలో మంద్రస్థాయిలో మామ్మ పాడటంతో వాళ్ళతోపాటు ఆమెకుకూడా కళ్ళుమూతలు పడతాయి.

"హాయిగా పడుకుని మంచికలలు కనండి."

ఆమె కళ్ళుమూసుకునే పాడుతూ నిద్రలోకి జారుకుంటుంది. కాని ఆ నిద్ర అరగంటసేపయినా పట్టదు. లేచి గ్లాసెడు మంచినీళ్ళు తాగి పక్కకు తిరిగి పడు

కుంటుంది. చిన్నపిల్లలమాదిరిగా ఆమెకు ఆ వయస్సులో నిద్రపడుతుందా ? ఏపనీ లేకపోతే మనసు గతంలోకి జారిపోతుంది.

ఒకప్పుడు ఆమెప్రపంచం రాగమయం. మహారాణిలా ఫోర్డుకారులో మురిపించి- మురిసే అమృతమూర్తితో ఆనందడోలికలలో ఊగుతూ గడిపింది. శ్రీమంతుల ఇంటపుట్టింది. కలిగినయింట పాదం పెట్టింది. అదొక సుందరస్వప్నం.

ఇప్పుడారోజులు కలలోనే కనబడతాయి.

మామ్మ పిల్లలు పెద్దవాళ్ళయ్యారు. ఆ పిల్లలలో ఆమె తన గతజీవితపుటానందాన్ని చూసుకున్నది. వాళ్ళపిల్లలు కంటిముందర తిరుగుతుంటే వాళ్ళల్లోనే తనపిల్లలను చూసుకుంటోంది.

ఇప్పుడు వాళ్లే ఆమె ప్రపంచం. బాలప్రపంచం.

తెల్లవారి తొమ్మిదిగంటలకు ఆ నలుగురు బిడ్డలూ దగ్గరలోఉన్న నర్సరీ స్కూళ్ళకువెళ్తారు. వాళ్ళస్నానాలు- డ్రెస్సులూ బ్రేక్‌ఫాస్టులూ ఆమెఅధ్వర్యంలో జరుగుతాయి. తీరా స్కూలుకు వెళ్లేసమయంలో ఒకరికి పెన్సిలు, ఒకరికి రబ్బరు కనబడవు. మరొకరికి పుస్తకానికి అట్టఉండదు. అవిచూసి సర్ది పంపించాలి. అంతలో ఒకరికి వెళ్ళాలని తొందర-ఇంకొకరికి బూటు లేసు తెగిపోతుంది. కళ్ళు నీళ్ళొస్తాయి. వాటిని మామ్మ చూడలేదు. వాళ్ళనందరినీ సమాధానపెట్టి, చెంపమీద ముద్దుపెట్టించుకుని టాటా చెప్పించుకుని వాకిట్లోనుంచి లోపలికి వస్తుంది.

నర్సరీస్కూళ్ళకు వెళ్ళేపిల్లలు తిరిగి ఒంటిగంటకు వస్తారు. ఈ లోపల ఆమెస్నానం భోజనం అవుతుంది. ఆమెకు ఏరోజు వార్తాపత్రిక ఆరోజు చదవకపోతే తోచదు. వారపత్రికలో ఏముందో చూసుకుని ఒక కునుకు తీసేసరికి ఒంటిగంట కావస్తుంది.

"అయ్యో ఒంటిగంటయింది. పిల్లలు వస్తారు." అనుకుంటూ లేచి గ్లాసెడు మంచినీళ్ళు తాగి పిల్లలకు మంచినీళ్ళు పళ్ళాలుపెట్టి సిద్ధంగా కూర్చుంటుంది. అంతలో బూట్లశబ్దం- మాటలు అరుపులు పాటల కూనిరాగాలతో పిల్లలు వస్తారు. బూట్లువిప్పి కాళ్ళు కడుక్కుని భోజనాలకు వస్తారు. వాళ్ళు భోజనాలుచేస్తుంటే క్లాసులో ఏంజరిగిందో టీచర్లు ఏంచెప్పారో అడుగుతుంది. అన్నివిషయాలు పూసగుచ్చినట్టు వాళ్ళుచెప్తారు.

పొద్దుననగా లేస్తారు గనుక భోజనాలుకాగానే కొంచెం సేపు అటూఇటూ తిరిగి నిద్రపోతారు. నాలుగుగంటలకుగాని లేవరు.

ఈలోపల మామ్మ ఇంగ్లీషు తెలుగు నవలలు చదువుతుంది. పిల్లల బట్టలు ఉతికినవి సర్దుతుంది. గుండీలుపోతే కుట్టుంది.

ఇంతలో కూతురో కోడలో కాఫీ తీసుకువస్తారు.

ఆయింటికానుకునే నర్సింగ్‌హోముంది. మామ్మ లోపలికివెళ్ళి రోగుల నందరినీ పలకరిస్తుంది. నర్సులతో మాట్లాడుతుంది. నౌకర్ల కష్టసుఖాలు విచారిస్తుంది. నర్సింగ్‌హోమ్‌చుట్టూఉన్న తోటలోకెళ్ళి చెట్లనుచూస్తుంది. పూలమొక్కలను తాకిచూస్తుంది. జాజి, మల్లె, మరువం రంగురంగుల కనకాంబరాలు కోసుకొచ్చి దండలు కడుతుంది. పిల్లలకు తలలు దువ్వి పూలదండలు తలలో పెడుతుంది. వాళ్ళతల్లులకు ఇప్పిస్తుంది పిల్లలచేత.

సాయంకాలపువేళల్లో పిల్లలకు పాటలు చెబుతూ ఆడిస్తుంది. హోంవర్కు చేయిస్తుంది.

మామ్మసంగతి విన్న ఇరుగుపొరుగులుకూడా పిల్లలను పంపిస్తారు. వాళ్ళతో మాట్లాడుతుంది. పాటలు ఆటలు నేర్పిస్తుంది. ఇలా ఆ వీధిలో పిల్లలందరూ మామ్మకు పరిచయమయ్యారు. ఆమెచుట్టూచేర్తారు. కథలు చెప్పమంటారు.

చూసినవాళ్ళంతా అంటారు- "ఎంత ఓపికండీ మీకు ? పిల్లలతో ఇలా కాలక్షేపం చేసేవాళ్ళను చూడలేదు, ఎక్కడో నూటికీ కోటికీ ఒకరుంటారు. పైగా నర్సింగ్‌హోమంతా తిరుగుతూ మాట్లాడిస్తారు వాళ్ళను."

నాలుగయితే పిల్లలు లేస్తారని నర్సింగ్‌హోముకువెళ్ళి వాళ్ళతో మాట్లాడతాను పాపం. ఆ పలకరింపుకే వాళ్ళకు జబ్బంతా పోయినట్లే ఉంటుందని మాట్లాడిస్తాను."

ఆ యింట్లో కూతురు కోడళ్ళు కొడుకులు అల్లుడు మనమలు వాళ్ళపిల్లలు ఉంటారు. ఉద్యోగాలుచేసే ఆడవాళ్ళున్నారు. ఇంటిసంగతి పిల్లలసంగతీచూసే వారొకరు కావాలి. ఉద్యోగాలకు వెళ్ళేవాళ్ళు వెళ్ళేటప్పుడు చెప్పివెళ్తారు. వస్తూనే పలకరిస్తారు. ఇల్లు ఎప్పుడూ సందడిగా ఉంటుంది. ఉద్యోగం చెయ్యనిచుట్టం

ఒకామె ఇంటిసంగతి చూసుకుంటుంది. ఎవరూ కనబడకపోతే మామ్మ ఆమెతో కబుర్లు చెబుతూ ఉంటుంది. ఆమెకు వీణవాయించటం అలవాటు. అన్నిపనులలో అదొకపనిగా ఒకగంటయినా వాయించుకుంటుంది.

పిల్లలురాగానే వాళ్ళతో కబుర్లుచెప్పి నవ్విస్తుంది. ఆమె పసిపిల్లలతో కలిసిపోయి పసిహృదయాలను పులకరింపచేసే కథలు కబుర్లు చెబుతుంది.

ఒకరోజు ఒకఅబ్బాయి తల్లిని "నీకంటె మా మామ్మ బాగా పాఠంచెబుతుంది" అన్నాడు వాళ్ళు పొరుగున ఉంటారు.

"ఎవర్రా ఆ మామ్మ ? నాకుచూపించు. పాఠం అంత బాగాచెబుతుందా ?" ఆశ్చర్యపడ్డది. పైగా "ఆమెకు చదువొచ్చా ?" అడిగింది.

"చూపిస్తారా ?'' అంటూ తల్లిని తీసుకువచ్చాడు.

"మామ్మా నిన్నుచూడ్డానికి మా అమ్మ వచ్చింది" అన్నాడు.

మామ్మ బయటికి వచ్చిచూస్తే ఒక ఆధునిక యువతి సిల్కుచీరె కట్టుకుని నిలబడి ఉంది.

"మీరేనా మామ్మ అంటే? మావాడు మీదగ్గర్నుంచి రానంటాడు. పాటలూ కథలూ పాఠాలు మీరు చెప్పినట్టు ఎవరూ చెప్పరట. మీరు పిల్లలను బాగా ఆకర్షిస్తున్నారు." అన్నది ఎంతో మర్యాదగా.

"మీవాడే కాదమ్మా మా పిల్లలూ వాళ్ళ స్నేహితులుకూడా వస్తారు. ఇక్కడే ఆడుతూ పాడుతూ ఉంటారు. ఇళ్ళకుపొమ్మంటే ఏడుస్తారు. పసి హృదయాలు కదూ ?''

"మీకెంత ఓపికండీ. ఒక్కపిల్లవాడితో మాకు విసుగువస్తుంటే ?" అన్నది. అలా అన్నది ఆమె ఒక్కతేకాదు- అనేకమంది ఆ వీధిలో.

పిల్లలు పెరుగుతున్నారు. స్కూళ్ళకు కాలేజీలకు వెళ్ళుతున్నారు. అందరూ మామ్మదగ్గర కాసేపు కూర్చుని మాట్లాడివెళ్తారు. ఆ యింట్లో అందరివేళలూ ఆమెకుతెలుసు. అందరూ పిల్లలవేళలూ పిల్లల సంగతులూ మామ్మనడిగి తెలుసుకుంటారు- ఆ యింట్లో.

వాళ్ళల్లో ఏఒక్కరు కొత్తబట్టలు కొనుక్కున్నా ముందు మామ్మకు చూపి

స్తారు. అవి వేసుకున్న తరువాత ఆమెకు దణ్ణంపెడతారు. ఆమె వాటిని మెచ్చుకుని వాళ్ళను ముద్దుపెట్టుకునేది.

ఆమె పిల్లలకూ పెద్దలకూ ఇరుగుపొరుగులకూ రోగులకూ నౌకర్లకూ ఆప్తురాలు. కష్టసుఖాలు ఆమెతో చెప్పుకుంటే మనసుకు శాంతిగా ఉండేది. ఆమె పిల్లలతోపాటు అందరికీ మామ్మే.

కాలచక్ర భ్రమణంలో ప్రకృతిలో ఎన్నోమార్పులు. ఇక మానవదేహం మాట చెప్పాలా ?

కాలంతోపాటు మామ్మ ఆరోగ్యంలోకూడా ఎన్నోమార్పులు కలిగాయి. అవయవాలు ఒక్కొక్కటి అదుపుతప్పుతున్నాయి. కాళ్ళనొప్పులు-వాపులు మొదలయ్యాయి. దగ్గు ఆయాసం వచ్చింది. వేళగాని వేళల్లో పడుకోవాలనిపించేది. దేహంలో బలహీనత చోటుచేసుకుంది. పిల్లలతో ఇదివరలోవలె మాట్లాడలేదు. కథలు చెప్పలేదు. పాటలు పాడుతూ ఆడించలేదు.

ఆమె ఒంటరిమనిషి. నలతగాఉంటే కళ్ళుమూసుకుని పడుకోవచ్చు కాని మనసు ఒప్పటంలేదు. ఏదోచెయ్యలేదనీ చెప్పలేదనీ ఆదుర్దా. ఆమెకు కాలక్షేపం కలిగించేవాళ్ళు ఆ పిల్లలే.

అలవాటుచొప్పున "మామ్మా నేను కొత్తచెప్పులేసుకున్నాను. కొత్తబట్టలు కొనుక్కున్నాను." అని చూపించటానికివస్తే కళ్ళెత్తిచూసి "బాగుంద"ని చెప్పలేని స్థితి. కాని ఒక్కొక్కళ్ళు వెళ్ళి ఆమె వినలేకపోయినా చెవిలో చెప్పివస్తున్నారు.

ఒకరోజు పొద్దున వాళ్ళులేచి చూసేసరికి మామ్మ నేలమీద చాపవేసుకుని పడుకునుంది- ఒంటినిండా బట్టకప్పుకుని.

ఆమె నిద్రపోయిందనుకున్నారు. "కాని- మంచమ్మీద పడుకోవచ్చుగా ?" అందరూ నిలబడి బిక్కముఖాలు పెట్టుకుని చూస్తున్నారు- గాని ఆమెను మంచమ్మీద పడుకోపెట్టరేమని ఆ పసిహృదయాలు అలమటిస్తున్నాయి.

ఇంటినిండా జనం. ఒక్కరయినా మంచమ్మీద పడుకోబెట్టరేమిటి?

పదిగంటలకు నల్లటివేన్‌వచ్చింది.

అందరూ సందడిగా తిరుగుతున్నారు.

పిల్లలకు ఆతురత ఎక్కువయింది. మామ్మను వేన్‌లో తీసుకువెళ్ళాలని అందరూ అనుకుంటున్నారు.

"మామ్మ ఎక్కడికి వెళ్తున్నది ?" ఒక్కొక్కళ్ళే అడుగుతున్నారు కన బడినవాళ్ళను.

పెద్దవాళ్ళ ముఖాలు కళాకాంతులులేకుండా ఉన్నాయి. కొందరు బిక్క ముఖాలు వేశారు.

"మామ్మ ఎక్కడికి వెళ్ళుతున్నది" వాళ్ళమనసుల్లో ఈ ప్రశ్న చెలరేగి పోతున్నది. ఆదుర్దాబడుతున్నారు.

ఎవరినడిగినా చెప్పరు.

ఒకపాప తల్లిని పీడించి అడుగుతోంది కన్నీళ్ళతో.

"మామ్మ వాళ్ళమ్మను చూడటానికి వెళ్ళుతున్నది." అంతకంటె ఇంకేం చెప్పలేకపోయిందా తల్లి.

''మామ్మకు అమ్మ ఉందా ?''

"ఆఁ అందరికీ ఉన్నట్టే ఉంది. చూసి చాలారోజులయిందట. రమ్మని వేన్ పంపించింది"

''ఒరే శంభూ ! శ్రీలూ ! అందరూ రండి. మామ్మకు గుడ్ బై చెప్పాలి రండి- రండి- తొందరగా."

పిల్లలు- ఆమెమీద మమతను పెంచుకున్న పసిహృదయాలు- బిక్క ముఖాలతో మామ్మ బుగ్గమీద ముద్దు పెట్టుకుని "మామ్మా తొందరగా వచ్చేయ్. విష్యూ ఎ హేపీ జర్నీ" అంటూ లైనుకట్టారు.

మామ్మను వేన్‌లోకి ఎక్కిస్తుంటే "టా టా మామ్మా" అంటూ అది కదిలే వరకూ నిలబడి గేటువరకూ సాగనంపాడు.

అదివరకూ చిన్నబోయిన ముఖాలతో నిలబడినవాళ్ళంతా పిల్లల మాటలకు బిగ్గరగా ఏడ్చారు.

"మామ్మ తొందరగావస్తే బాగుండు. ఈలోపల మనకు కథలూ పాటలూ

రాత్రి రామాయణంపాట చెప్పటానికి- రేపు హోంవర్కు చేయించటానికి ఎవరొస్తారు ? భోజనాలు ఎవరు పెడతారు ? మంచినీళ్ళు ఎవరందిస్తారు ?" అందరి ముఖాలూ చిన్నబోయాయి.

"అయ్యో నా యూనిఫారమ్ రేపటికి తయారుందో లేదో ?"

"శంభూ నా జాకెట్‌కి గుండిపోయిందిరా ఎట్లా ?" శ్రీలు కళ్ళు నులుపు కుంటోంది.

"నాకు రేపటికి పాఠం ఎట్లా ?"

"నాకు రైమ్సు రాలేదు. మధ్య తప్పొచ్చింది ఎట్లా" పొరుగింటి అబ్బాయి.

ఎట్లా- ఎట్లా ?

అనుకుంటున్నారు పిల్లలు- ఒకరుకాదు ఆ వాడలోని పిల్లలంతా.